కథ

శ్రీదేవీ మురళీధర్

# సాగర్@14

చాలా జాగ్రత్తగా, చప్పుడు ఏ మాత్రం బయటికి వినిపించకుండా రిసీవర్ క్రెడిల్‌పై ఉంచాడు సాగర్. నాన్నగారు టీవీ చూస్తున్నట్లుగా శబ్దం ఇంకా వినబడుతోంది. తలుపు దగ్గరికి వెళ్లి హాల్లోకి చూశాడు. రాత్రి పదకొండవుతోంది.

సోఫా మీద విశ్రాంతిగా జారిగిలబడి ఫుట్‌బాల్ మాచ్ చూస్తున్నాడు ప్రభాకర్. సాగర్ మళ్లీ గదిలోకి వచ్చి నెమ్మదిగా మైకెల్ నెంబరు నొక్కాడు. 'హలో' రహస్యంగా వినిపించింది మైకెల్ గొంతు.

"రేపు పదకొండున్నర లోపల 'రశ్మి' దగ్గర కలుస్తున్నాం. కౌంటర్ దగ్గర కాష్‌తో రెడీగా ఉండు మర్చిపోకు" సాగర్ ఏదో అనే లోపల క్లిక్‌మని డిస్‌కనెక్ట్ అయింది ఫోను.

గబగబా సమీర్ నెంబరు కలిపాడు. "హలో సాగర్! ఆఖరి నిముషంలో మోసం చెయ్యకు. ఎలాగైనా నాలుగు వందలు ఎరేంజ్ చెయ్యి మర్చిపోకు. అందరం పదకొండున్నరకు 'రశ్మి' దగ్గర కలుస్తున్నాం, తెలుసుగా. రాకుండా ఉండకు. భలే ఎంజాయ్‌మెంట్‌లే. నా దగ్గరే డబ్బుంటేనా? మన క్లాస్‌మేట్స్ అందరికీ నేనే టికెట్లు కొని తీసుకువెళ్లే వాడిని. నీ బర్త్‌డే కాబట్టి మన జట్టుకి నువ్వే పార్టీ ఇవ్వాలి. ఒరేయ్. ఆల్‌రెడీ నాలుగు సార్లు చూశానురా" ఉత్సాహంగా చెప్పుకుపోతున్న సమీర్‌ను వారించాడు సాగర్.

"ఒరే సమీర్.. నా దగ్గర డబ్బు లేదురా. నిజంగా. ఎక్కడి నుంచి తెమ్మంటావు? మా నాన్నను అడిగితే నాలుగు వందలు ఎందుకు అంటారు. నాకు భయం బాబూ"

ఫకాలున నవ్వాడు సమీర్. "నీ స్నేహితులందరికీ ట్రీట్ ఇస్తున్నానని చెప్పు".

"అలా చెప్పలేనురా. ఇంట్లోనో, క్లబ్‌లోనో లంచ్ ఎరేంజ్ చేస్తానంటారు. అదీకాక నేను ఆయన వంక చూస్తూ అబద్ధాలు ఆడలేనురా."

"ఎహె యూస్‌లెస్ ఫెలో. స్కూల్లో ఏదో ఏక్టివిటీకి తెమ్మన్నారని చెప్పలేవ్రా?"

"ఏమోరా, ఎప్పుడూ అలాంటివి చెప్పలేదు ఇంతవరకు"

"ఓహో, బయలుదేరాడండీ సత్యహరిశ్చంద్రుడు! ఇంతవరకు చెప్పకపోతే ఇప్పుడు చెప్పటం నేర్చుకో. తప్పేంలేదు. రేపు సంపాదించినప్పుడు తీసుకున్నదంతా తిప్పి ఇచ్చేద్దుగానిలే. అంత ఫీలవ్వకు. అయినా నువ్వేం చెబితే నాకెందుకురా. డబ్బుతో కౌంటర్ దగ్గర అనుకున్న టైంకి కలుద్దాం. బెగ్, బారో, స్టీల్... అంతా నీ కోసం ఎదురుచూస్తుంటాం. రెండు గంటలకు వదులుతారు...అరగంటలో ఇంటికి వెళ్లిపోవచ్చు లేదా అలా అలా సరదాగా తిరిగి స్కూలు వదిలే టైముకి గూటికి చేరదాం."

"అది కాదురా..." సాగర్ చెప్పే లోపల ఫోను పెట్టేశాడు సమీర్.

నాన్నగారు చూడకుండా సోఫా వెనుక నుంచి ఆయన బెడ్‌రూం వైపు నడిచాడు సాగర్. మాచ్ మాంఛి పట్టులో ఉండటంతో ఆయన దృష్టి. ఆసక్తి టీవీపై నిలిచి ఉన్నది. అలాగే టీవీ చూస్తూ నిద్రపోవడం ఆయనకు పరిపాటే.

**బయటికి వ్యక్తం చేసినా, చెయ్యకపోయినా పెద్దవాళ్ల దగ్గర పిల్లలు ఎంతో ఎక్కువగా ఆశించేది ఒక్కటే ఒక్కటి. వారి ప్రేమపూరితమైన సమయం, దగ్గరితనం. దీన్నే 'క్వాలిటీ టైం' అంటారు. అది ఒక్కటే పిల్లలకు మనస్ఫూర్తిగా కేటాయించదగిన వారు 'తల్లిదండ్రులు' అనే పదానికి సరైన నిర్వచనాలు.**

గదిలో అమ్మ అటు తిరిగి నిద్రపోతోంది. పాపం ఏడాది నుంచీ జబ్బుగా ఉన్నది. బాగా కోలుకోలేదు. బట్టలస్టాండ్‌పై నాన్నగారి పాంటు, షర్టు తగిలించి ఉన్నాయి. అడుగులో అడుగు వేసుకుంటూ అటుగా నడిచాడు సాగర్. ఒకటికి నాలుగుసార్లు ఎవరూ గమనించటం లేదని నిర్ధారించుకుంటూ నాన్నగారి షర్టు జేబుకేసి వణుకుతున్న చేతిని పోనిచ్చాడు.

* * *

సాగర్ తండ్రి ప్రభాకర్ చాలా బిజీ మనిషి. అస్తమానం ఆఫీసు పనులు, మీటింగులు, కాన్ఫరెన్సుల్లో తలమునకలుగా ఉంటాడు.

ఇంట్లో ఉన్న కాసేపూ ఇంటర్నెట్, ఫోన్లు, టీవీలో స్పోర్ట్స్ ఛానెల్ వీటితో గడుపుతాడు. సాగర్ తల్లి జబ్బు మనిషి. అక్క కర్ణాటకలో మెడిసిన్ చదువుతోంది.

***

తండ్రి దగ్గర సాగర్‌కి పెద్దగా చనువులేదు.

ఆయన స్వభావరీత్యా గంభీరంగా, స్ట్రిక్టుగా ఉంటాడు. అలా అని అస్తమానం అరవడు. కానీ చూడగానే జంకు కలిగించే వ్యక్తిత్వం ఆయనది. సాగర్ పెరుగుతున్న కొద్దీ కొత్త పరిచయాలు, స్నేహితులు చుట్టూ చేరసాగారు. ఇంట్లో ఎంతో ఒంటరితనాన్ని అనుభవించే సాగర్ ఆ రోజు పధ్నాలుగవ సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నాడు.

* * *

పారడైజ్ దగ్గర బస్ దిగి వడివడిగా నడుస్తూ 'రశ్మి' థియేటర్ చేరుకున్నాడు సాగర్. బస్టాప్‌కి థియేటర్ కొద్ది దూరంలో ఉంది. స్కూల్ డ్రెస్సులో, బాగ్‌తో థియేటర్‌కి వచ్చిన తనలాంటి వారే నలుగురు స్నేహితుల గుంపు కోసం చురచురా చూస్తూ స్వాగతం చెప్పింది.

"అవతల షో మొదలైంది. స్టుపిడ్. టైం చూసుకున్నావా? పదకొండూ యాభై" "ఇప్పుడా రావటం? ఇంకా నయం. మానేస్తాననుకున్నా."

"అది కాదురా సాగర్. మేమంతా రాలేదురా? ఎంతసేపటి నుంచి ఎదురుచూస్తున్నాం."

"ఊ కానీ కానీ డబ్బులిటివ్వు." అసహనంగా అన్నాడు సమీర్. అందరి కోపతాపాల్ని మౌనంగా భరిస్తూ జేబులోంచి నోట్లు తీసి అందించాడు. అందరి ముఖాలు విప్పారాయి. "నాన్నగారు ఇవాళ బంజారా

హిల్స్ వెళ్తూ స్కూల్ దగ్గర దింపారురా. అక్కడి నుంచి వస్తున్నాను. అందుకే ఇంత లేటయ్యింది."

"అదేమిత్రా? రోజూ స్కూల్ బస్‌లోనే వస్తావుగా. మీ నాన్న ఎందుకు దింపారు?"

"నా బర్త్‌డే కదరా, ఇదుగో ఇవాళ ఈ సెల్‌ఫోన్ ప్రజంట్ చేశారు. గుడికి తీసుకువెళ్లి స్కూల్ దగ్గర దింపారు."

"ఓ. అలాగా, "సమీర్ టికెట్లు తెచ్చేలోపల అంతా సెల్‌ఫోన్ ఫీచర్స్ పరీక్షించి చాలా బాగుందన్నారు. మొదటి ఫోన్ మా నాన్నగారు తనకే చెయ్యమన్నారు" గర్వంగా చెప్పాడు సాగర్.


హాలు బయటంతా జనసంచారం ఎక్కువగా లేదు. అంతా లోపలికి నడిచాడు. సినిమా మొదలై అరగంట దాటింది. ఆ చీకటిలో అంతా ఓ చివరకు చేరి వరుసగా కూర్చున్నారు. అంతకు ముందే పలుమార్లు చూచిన సమీర్ గొంతు తగ్గించి జరిగిపోయిన కథంతా మిత్రులకు చెబుతున్నాడు.

ఒక గొప్పింటి స్కూల్ కుర్రాడి ఎదురింట్లో ఒక వేశ్య ఉంటుంది. రోజూ రకరకాల మనుషులు అన్నివేళలా ఆ ఇంటికి రాకపోకలు సాగించటం ఆ కుర్రాడు కుతూహలంగా గమనిస్తూంటాడు. ఆ అబ్బాయి మనసంతా ఆ ఇంట్లో ఏం జరుగుతోందని ఊహిస్తూంటుంది. అది గమనించి ఆ వేశ్య అతడిని పిలిచి తన గదిలో ఒక తెరచాటున కూచుని అక్కడ జరిగేదంతా చూసే ఏర్పాటు చేస్తుంది. అందుకు డబ్బు కూడా వసూలు చేస్తుంది.

హాల్లో నిట్టూర్పులు, సన్నగా ఈలలు.. విచ్చలవిడి శృంగారం మొదలు కాబోతున్న సూచనలు. సమీర్, మిత్రులు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు.

సాగర్ మనసంతా వ్యక్తం చేయలేని అశాంతి, అపరాధభావన, అలజడి... అన్నీ కలగలిసి ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా "ఇప్పుడే వస్తానురా" అంటూ తటాలున లేచి తలుపు వైపు నడిచాడు. "అదే మిత్రా... అసలు సీన్లన్నీ ముందున్నాయి..." చూపు స్క్రీన్ మీది నుంచి తిప్పకుండా అంటున్నారు మిత్రులు. ఎవరూ ఇతరులని పట్టించుకునే స్థితిలో లేరు.

హాల్ బయటికి వచ్చి నిలబడ్డాడు సాగర్. ప్రాణం లేచివచ్చినట్లయింది. ఆరుబయటి వెలుతురూ, గాలీ తగలగానే కొన్ని క్షణాలు ఆ సహజ వాతావరణంలో గడపగానే మనసు కాస్త కుదుటపడి అశాంతి, అలజడీ నెమ్మదించాయి.



ఇక రెండో ఆలోచన లేకుండా గేటుదగ్గరికి నడిచాడు. గేటు బయట ఉన్న పెద్ద చెట్టు నీడకి చేరి సెల్‌ఫోన్ ఉన్న ఒకే ఒక నంబరు నొక్కాడు.


నాన్నగారికే మొదటి కాల్.

'సాగర్? యస్?'

"నాన్నగారండీ. నేనే. మీరు.. మీరు ఒక్కసారి సికింద్రాబాద్ 'రశ్మి' థియేటర్ దగ్గరకి రాగలరా? పారడైజ్ దగ్గరండి" తత్తరపాటుతో అన్నాడు. తండ్రి ఏమన్నాడో తెలీదు కానీ సాగర్ ముఖం వివర్ణమైంది. "అంతా చెప్తానండి. రండి నాన్నా...ప్లీజ్.. ఎదురుచూస్తాను" కళ్లల్లో నీళ్లు తిరుగుతూండగా డిస్కనెక్ట్ చేశాడు.

దాదాపు పది నిమిషాలు తన ప్రమేయం లేకుండా జలజలా రాలుతున్న కన్నీరు అరచేతితో తుడుచుకుంటూ దిక్కులు చూస్తూ నిలబడ్డాడు. తండ్రి వస్తాడు. ఏమంటాడో, తానేం

చెప్పాలి. ఇవేవీ ఆ పధ్నాలుగేళ్ల కుర్రాడు ఆలోచించటం లేదు. "నేను నాన్నను మోసం చెయ్యను, నాన్న కావాలి" ఇదొక్కటే ఆ పసిమనసు ఘోష పెడుతోంది.




కాసేపటిలో ప్రభాకర్ కారు అటుగా వచ్చింది. ఆయన తీక్షణమైన చూపులు థియేటర్ బయటి అశ్లీల పోస్టర్లను చూసి అక్కడ ఆడే సినిమాను బేరీజు వేశాయి. స్కూల్ డ్రెస్సులో, బాగ్‌తో గేటు దగ్గర చెట్టు కింద నుంచున్న కన్న కొడుకు వంక చూరుగ్గా చూశాడాయన. కారు దిగి వాడి గొంతు నులిమేటంత కోపం ఆయనలో ఒక్క ఉదుటున పొంగింది. గంట క్రితం ఎంతో సంతోషంగా దైవదర్శనం చేయించి బడి దగ్గర దింపిన వాడు ఇక్కడ ఎలా తేలాడు? ఇదేనా వీడు వెలగబెడుతున్న చదువు? లక్షకు పైగా ఏటా జీతం కట్టి అన్నింటికంటే మంచి స్కూల్‌లో చదివిస్తున్నాడు. ఇవాళ జేబులో కొంత డబ్బు తేడా వచ్చినట్లు అనుమానం. ఇది వీడి పనేనా? ఎన్నాళ్ల నుంచి జరుగుతోంది ఈ ఛండాలం? రోడ్డుకు అవతల కారాపి దిగాడాయన. ఆయనను చూసి మ్లానవదనంతో కళ్లు పదేపదే తుడుచుకుంటూ నిలబడ్డాడు సాగర్.

పశ్చాత్తాపం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతున్న కొడుకు ముఖం ఆవేశపు పొంగును తగ్గించి ఆయనలో విచక్షణను తట్టిలేపింది.

"ఇలాంటి సినిమాలు చూచి ఏమీ ఎరగనట్లు బడి వదిలే వేళకు ఇల్లు చేరితే నాకు అసలు తెలిసే అవకాశమేదీ? నాకు ఫోన్ చేసి మరీ నన్ను పిలిచాడు. నా కోపం, క్రమశిక్షణ వాడికి తెలుసు. అయినా జంకకుండా నన్ను రమ్మని వాడంతట వాడే అడిగాడు. దండనకు కూడా భయపడలేదంటే వాడికి ఇది ఖచ్చితంగా మొదటి తప్పటడుగే. తనను తాను పడిపోకుండా కూడదీసుకుని నిలదొక్కుకున్నాడు.

> సమయం మనుషుల్ని దూరం చేస్తుంది. ఎప్పటికీ కలవని రైలు పట్టాలలా.
>
> సమయం మనుషుల్ని కలుపుతుంది. ఎప్పటికీ విడిపోని ప్రేమానుబంధంలో.
>
> ప్రాణపదంగా ప్రేమించే బిడ్డలపై పెద్దలు వెచ్చించాల్సినదల్లా 'సమయమే'.

వీడికి నేను ఊతగా నిలవాల్సిన సమయం వచ్చినట్లుంది". నాలుగడుగుల దూరం వచ్చేసరికి తండ్రి దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చాడు సాగర్. కొడుకు చేతిలో బాగ్ అందుకుని, రెక్కపట్టుకుని కారువైపు నడిపించాడు ప్రభాకర్.

ఇద్దరూ కార్లో కూచోగానే "ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చెయ్యను నాన్నా. ఐ యాం రియల్లీ వెరీసారీ. మీ జేబులోంచి దొంగతనంగా డబ్బు కూడా తీశాను. ఇక్కడికి రావటం కోసం... వెరీ సారీ నాన్నా.. నన్ను నమ్మండి, ప్లీజ్.. ఇంకెప్పుడూ తప్పుడు పనులు చెయ్యను" వలవలా నడుస్తూ చెబుతున్న కొడుకును అక్కున చేర్చుకుని తలపై ముద్దు పెట్టుకున్నాడు తండ్రి.

"నాకు తెలుసు. తప్పేదో, ఒప్పేదో గ్రహించే మంచి బుద్ధి నీకుందని. నిన్ను నేను నమ్ముతున్నాను. నువ్వు వేసే ప్రతీ అడుగులో నీ వెంట నేను నిలబడి ఉంటాను" అనుకున్నాడాయన చెమర్చిన కళ్లతో దృఢంగా.

ఎప్పుడూ గంభీరంగా ఉండే నాన్నగారు తనను దగ్గరికి తీసుకుని ఓదార్పునివ్వటం, ముద్దాడటం పసివాడి కలతపడ్డ మనసుకి ఎంతో శాంతినీ, భద్రతాభావాన్ని కలిగించాయి. "నీకు నేనున్నాను" అనే భావన, నమ్మకం కొడుకుకు తన స్పర్శ కలిగించిందని తండ్రికి ఆ క్షణం అర్థమైంది. ఆ దగ్గరితనం ఆ తండ్రికో కనువిప్పు.

అనుకోకుండా ఇద్దరికీ దక్కిన ఈ నూతన సాన్నిహిత్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ వారు కలిసి ప్రయాణిస్తున్నారు.

ఇద్దరి మనసుల్లో ఒకేసారి మెదిలిన భావం...
ఈరోజు ఎప్పటికీ మరిచిపోలేని పుట్టిన రోజు.

○



# మలయాళంలో ఉదయ్‌కిరణ్

టాలీవుడ్‌లో సినిమాలు తగ్గిపోవడంతో కోలీవుడ్‌పై దృష్టి సారించి అక్కడ ఒకటీ అరా చాన్సులు సంపాదించుకుంటున్న ఉదయకిరణ్ ఇప్పుడు మాలీవుడ్‌లోనూ ప్రయత్నాలు మొదలెడుతున్నాడని వార్తలు చెబుతున్నాయి. మలయాళంలో మమ్ముట్టి నటిస్తున్న ఓ చిత్రంలో ఉదయకిరణ్ ఓ ముఖ్యపాత్ర లభించిందిట. ఇది గనక సక్సెస్ అయితే మలయాళంలో కంటిన్యూ అవడంలో తప్పేం వుంది అంటున్నాడు ఉదయకిరణ్. ఆల్రెడీ తనకి తమిళం బాగా వచ్చేసిందని, త్వరలోనే మలయాళం కూడా నేర్చేసుకుంటానని అంటున్నాట్ట ఉదయకిరణ్.